ప్రజాశక్తి
బుధవారం 30 ఆగస్టు 2023
5
శ్రీకాకుళం



## ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లపై రాత్రి, పగటిపూట స్పష్టంగా కనిపించే విధంగా రేడియంతో కలిసి ఉన్న రంగులు వేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక సూచించారు. నవభారత్ కూడలిలో జాతీయ రహదారి వద్ద మంగళవారం పరిశీలించి ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు. అధిక వేగ నియంత్రణ బోర్డులు, ప్రమాద హెచ్చరిక బోర్డులతో పాటు ఇసుక డ్రమ్ములను కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హైవే అధికారుల సమన్వయంతో మలుపులు, ముఖ్య కూడళ్లలో స్పీడ్ బ్రేకర్స్, ఎల్లో బ్లింకర్స్ అవసరమైచోట త్వరితగతిన పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌పి వెంట ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు వై.శృతి, ఎస్.బాలరాజు, సిఐ ఆదాం, ఎస్ఐ సత్యనారాయణ తదితరులున్నారు.

# రేషన్ పంపిణీలో అవస్థలు

- రెండుసార్లు వేలిముద్రలతో ఇబ్బందులు
- వెంటాడుతున్న సర్వర్ సమస్యలు
- పనిభారంతో ఎండియు ఆపరేటర్లు సతమతం

**మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (రేషన్ వాహనాలు) ద్వారా రేషన్ పంపిణీ మొదలు పెట్టిన నాటి నుంచి ఆపరేటర్లకు ఏదో రూపంలో కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. తొలుత వాహనాలకు చెల్లించాల్సి వాయిదా సొమ్ము కోసం కొంత కాలం పోరాడారు. తర్వాత వాహనాల ఇన్సూరెన్స్ డబ్బులను వారి వేతనాల నుంచి మినహాయించడంతో ఉన్నతాధికారుల చుట్టూ తిరిగారు. ఆ సమస్య పరిష్కారం అయ్యాక ఇప్పుడు తాజాగా మరో సమస్య వచ్చి పడింది. లబ్ధిదారులకు ఇప్పటివరకు ఒకసారి వేలిముద్రతో రేషన్ పంపిణీ చేస్తుండగా, ఈ ఏడాది జూలై నుంచి బియ్యానికి ఒకసారి, ఇతర సరుకులకు మరోసారి రెండుసార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి రావడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్యను పరిష్కరించకుంటే వచ్చే నెల నుంచి విధులు నిర్వర్తించలేమని వారు తేల్చి చెప్తున్నారు.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేసేందుకు ప్రభుత్వం మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎండియు) వ్యవస్థను 2021, ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేందుకు జిల్లాలో 422 మంది ఆపరేట్లను నియమించారు. డోర్ డెలివరీ చేసే ఆపరేటర్‌కు తొలుత ప్రభుత్వం రూ.16వేలు వేతనంగా నిర్ణయించింది. వాహనాలకు డ్రైవర్లుగా మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని చెప్పిన ప్రభుత్వం తర్వాత వారితో తూకం, ఈ-పాస్ మిషన్‌లో వివరాలు నమోదు తదితర పనులు అప్పగించింది. దీంతో తమకు ఇస్తున్న వేతనం చాలదని నాలుగు రోజులు పనిచేసి ఆపేశారు. దీంతో ప్రభుత్వం వారితో చర్చలు జరిపి అప్పట్నుంచి నెలకు రూ.21వేలు వేతనంగా చెల్లిస్తోంది. అందులోనే ప్రతి నెల రేషన్ వాహనానికి సమకూర్చిన రుణానికి వాయిదా సొమ్ముగా రూ.3 వేలును జమ చేసుకుంటోంది. ప్రతి నెల రూ.18వేలు మాత్రమే అందడంతో అవి ఏ మూలకూ సరిపోవడం లేదు.



సరుకులు అందిస్తున్న ఎండియు ఆపరేటర్ (ఫైల్)

### రెండుసార్లు వేలిముద్రలతో పంపిణీలో ఆలస్యం

ప్రభుత్వం ఇస్తున్న వేతనం చాలకపోయినా ఆర్థిక ఇబ్బందుల మధ్యే పంపిణీ సాగిస్తున్నారు. ఈ ఏడాది జూలై నుంచి రేషన్ పంపిణీ ప్రక్రియలో ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం వారికి తలనొప్పిగా మారింది. బియ్యానికి ఒకసారి, ఇతర సరుకులకు మరోసారి వేలిముద్రలు తీసుకుని సరుకులు అందించాలని ప్రభుత్వం ఆదేశించడంతో వారిపై తీవ్ర పనిభారం పెరిగింది. రెండు సార్లు తూకం వేయాల్సి రావడం, సర్వర్ సమస్యలతో ఒక్కో కార్డుదారుడి కోసం 15 నుంచి 20 నిమిషాల సమయం పడుతోంది. సిగ్నల్ సమస్యలు తీవ్రంగా ఉన్న చోట అరగంట సమయం పడుతోంది. దీంతో కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులు విసిగెత్తి ఆపరేటర్లతో గొడవకు దిగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

### ఆపరేటర్లకు పెరిగిన ఖర్చులు

రేషన్ పంపిణీలో రెండుసార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి రావడంతో రేషన్ పంపిణీ కోసం ఆపరేటర్లు అదనపు రోజులు కేటాయించాల్సి వస్తోంది. గతంలో వారి పరిధిలోని కార్డుదారులకు 15 రోజుల్లోనే రేషన్ పంపిణీ చేసే పరిస్థితి ఉండగా ఇప్పుడు 20 రోజుల వరకు సమయం పడుతోందని చెప్తున్నారు. దీంతో పంపిణీ కోసం తీసుకొస్తున్న సహాయకుడికి అదనంగా డబ్బులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు చాలక అవస్థతలు పడుతున్న ఆపరేటర్లకు సహాయకులకు అదనంగా డబ్బులు చెల్లించాల్సి రావడంతో వారి ఆర్థిక ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. ఒకసారి వేలిముద్రతో సరుకులు అందించడం లేదా రెండుసార్లు వేలిముద్రల పంపిణీకి అనుగుణంగా ఒక్కో ఆపరేటర్‌కు అదనంగా రూ.5 వేలు చెల్లించాలని ఆపరేటర్లు కోరుతున్నారు.

### సమస్య పరిష్కరించకుంటే విధులు నిర్వర్తించలేం



రేషన్ పంపిణీలో రెండుసార్లు వేలిముద్రలు తీసుకోవడం వల్ల ఆపరేటర్లపై తీవ్ర పనిభారం పెరిగింది. పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులతో చాలామంది మానేస్తున్నారు. రెండుసార్లు వేలిముద్రలు తీసుకోవడం, సర్వర్లు పనిచేయకపోవడంతో ఒక్కో కార్డుదారుడి కోసం అధిక సమయం కేటాయించాల్సి వస్తోంది. కార్డుదారులు అసహనంతో కొన్నిచోట్ల ఆపరేటర్లపై దాడులు చేస్తునానరు. దీంతో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోంది. ప్రభుత్వం ఒకే వేలిముద్రతో సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఒకటో తేదీ నుంచి విధులు నిర్వహించలేం.

**- రౌతు సూర్యనారాయణ, ఎండియు ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు**

### చాలా ఇబ్బందిగా ఉంది



సరుకులు ఇస్తున్న సమయంలో పొలం పనులు ప్రారంభం కావడం వల్ల అధికశాతం మంది గ్రామంలో అందుబాటులో ఉండటం లేదు. వారి కోసం రోజంతా ఎదురు చూడాల్సి వస్తోంది. ఒకేసారి అందరూ రావడం రెండు సార్లు వేలి ముద్రలు వేయిస్తుండటంతో ఎక్కువ సమయం పడుతోంది. పనులు మానుకుని వస్తున్న కార్డుదారులు అసహనానికి గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలి.

**- హేమసుందర్, ఎండియు ఆపరేటర్, బూర్జ**



పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

## అక్టోబరు 15, 16న జాతీయ సెమినార్

### జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సిఐటియు జాతీయ నాయకులు పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా లేబర్ కోడ్‌లు - కార్మిక వర్గంపై ప్రభావంపై అనే అంశంపై జాతీయ సెమినార్‌ను అక్టోబర్ 15, 16 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు, సంస్థలు, ప్రజలు సెమినార్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సెమినార్ బ్రోచర్లు, కరపత్రాలను నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సెమినార్‌కు సిఐటియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.వి నాగేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను ఆధునిక బానిసలుగా మారుస్తున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలతో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ తదితర నిత్యావసర నరుకుల ధరలు, విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. దీనివల్ల కార్మికుల నిజ వేతనాలు, ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు సిఐటియు అనేక పోరాటాలు చేస్తోందని చెప్పారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్వహిస్తోందన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు అనేక ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. పలురంగాల కార్మికులు, మున్సిపల్, పంచాయతీ, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, విఒఎ తదితర స్కీమ్‌వర్కర్లు, విఆర్‌ఎ, భవన నిర్మాణ, హమాలీ తదితర కార్మికులకు కనీస వేతనాల కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతోందని వివరించారు. ఉద్యోగులకు మెరుగైన పిఆర్‌సి ఇవ్వాలని చేసిన పోరాటాలకు మద్దతుగా సిఐటియు నిలబడిందన్నారు. కరోనా సమయంలో అనేక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి రమణ, జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

## రీ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- వేగవంతం చేయకుంటే విధుల నుంచి తప్పుకోండి
- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

సమగ్ర భూ రీ సర్వే పనులను సక్రమంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో రీ సర్వే పనులపై టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 17 మండలాల తహాశీల్దార్లు, ఆర్‌ఐలు, సర్వేయర్లు, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బందితో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రీ సర్వేలో నిర్లక్ష్యం తగదన్నారు. కొన్ని మండలాల్లో సర్వే పనుల్లో ఎందుకు జాప్యమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు చేపట్టిన రీసర్వే పనుల్లో మండలాల వారీగా ఎంతమేరకు పూర్తి చేశారో చెప్పాలని ఆదేశించారు. సర్వే సమయంలో భూ హక్కుదారులను పిలవకుండా చేయడం వల్ల అపోహలకు దారితీస్తుందన్నారు. గ్రామ సచివాలయం పరిదిలో సర్వే చేపడుతున్నప్పుడు విఆర్‌ఒ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రెండో విడత రీ సర్వే పనులు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. లేకుంటే విధుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలన్నారు. ఇప్పటివరకు చేపట్టిన రీ సర్వేలో ఉన్న లోటుపాట్లను గమనించి ఇకపై ఎటువంటి లోపాలు తలెత్తకుండా ఉండేలా చూసుకోవాలని సూచించారు. రీ సర్వే పనులు నత్తనడకన నడుస్తున్న మండలాల్లో సర్వేయర్లు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి, తహాశీల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో జిల్లా ఖ్యాతిని పెంచాలి

### జాతీయ క్రీడా దినోత్సవంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో శ్రీకాకుళం క్రీడాకారులు సత్తా చాటి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, సెట్‌శ్రీ సంయుక్తంగా నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. క్రీడా జ్యోతిని వెలిగించి పాలకొండ రోడ్డు మీదుగా కోడి రామ్మూర్తి స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన బాక్సింగ్, తైక్వాండో, వెయిట్ లిఫ్టింగ్ క్రీడలను కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానచంద్ తొలిసారిగా దేశానికి ఒలింపిక్ మెడల్‌ను సాధించడమే కాకుండా, మూడుసారు బంగారు పతకాలను సాధించి గొప్ప గుర్తింపు తెచ్చారని కొనియాడారు. ఆయన విజయాలను వందేళ్లయినా నేటికీ గుర్తు చేసుకుంటున్నామన్నారు. ఆయన స్ఫూర్తితో జిల్లా క్రీడాకారులు ఎన్నో విజయాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రపంచంలోనే అతి పెద్ద జనాభా కలిగిన దేశం మనదైనప్పటికీ క్రీడల్లో వెనుకబడి ఉన్నామని, అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఖేలో ఇండియా, ఆడుదాం ఆంధ్రా ' వంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ క్రీడలను ప్రోత్సహిస్తున్న సంగతిని కలెక్టర్ గుర్తు చేశారు. క్రీడల్లో పతకాలు సాధిస్తే దేశానికి, రాష్ట్రానికి మంచి పేరును తీసుకురావడమే కాకుండా ప్రభుత్వ ఉద్యోగాలు కూడా లభిస్తాయని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు, సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రీడల్లో విశేష కృషి చేసిన జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఎస్.ఆర్ కష్ణమూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తిని సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమాన్ని అక్టోబర్ 2 నుంచి నవంబర్ 2 వరకు నిర్వహిస్తుందన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ పోటీలు ఇందులో ఉంటాయని, గ్రామ- వార్డు సచివాలయాలు, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విజేతలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నగదు బహుమతిని అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా చీఫ్ కోచ్ శ్రీధర్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, నెహ్రూ యువ కేంద్రం అకౌంట్స్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల్లో మనోధైర్యాన్ని కల్పించాలి

- అందుకే 'చిన్నారికి చేదోడు'
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం




మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న పిల్లల్లో భయాన్ని తొలగించి మనోధైర్యాన్ని కల్పించి, వారిలో నేర ప్రవృత్తి భావాన్ని తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పిలుపునిచ్చారు. అనుభవజ్ఞులైన 60 ఏళ్లు దాటిన పెద్దలు ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న పిల్లలకు బాసటగా నిలవాలన బృహత్కరమైన ఆలోచనతో ఎస్‌పి ప్రతిష్టాత్మకంగా 'చిన్నారికి చేదోడు' కార్యక్రమం ఇదివరకు ప్రవేశపెట్టారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కౌనిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న పిల్లల్లో భయం, ఆత్మహత్య అనే దురాలోచన తొలగించేందుకు ఎటువంటి లాభాపేక్ష లేకుండా 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్ల పిల్లలకు కౌన్సెలింగ్ నిమిత్తం రావాలని జిల్లా పోలీస్ శాఖ పిలుపు మేరకు 77 మంది వచ్చారని తెలిపారు.

జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న వసతిగృహ బాలబాలికలకు సూచనలు అందించి వారి ఆలోచనల్లో మార్పు తీసుకొచ్చారని కొనియాడారు. మరికొంతమంది ఇందులో భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇటీవల రాష్ట్ర హైకోర్టు జడ్జి వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ కార్యక్రమం కోసం వివరించగా చాలా మంచి కార్యక్రమం అని కొనియాడారని చెప్పారు. ఇలాంటి కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలు చేస్తే చాలా మంచి ఫలితాలు వస్తాయని తెలిపారన్నారు. ఈసారి వసతిగృహాలకు వెళ్లినప్పుడు ఒక్కో విద్యార్థితో కలిసి మాట్లాడి కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. పలు కారణాలతో కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఈ కార్యక్రమం ప్రవేశపెట్టాక జిల్లాలో ఆత్మహత్యలు సంఖ్య తగ్గుముఖం పట్టాయని తెలిపారు.

అదనపు ఎస్‌పిలు టి.పి.విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి వసతిగృహానికి మానసిక నిపుణులు లేనందున, కౌన్సెలర్ల ద్వారా విద్యార్థులు మనోధైర్యాన్ని పెంపొందించుకున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సెలర్లు తమ అభిప్రాయాలను తెలియజేశారు. అనంతరం కౌన్సెలర్లను ఎస్‌పి సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డిఎస్‌పి వై.శృతి, ఎస్.బాలరాజు, సిఐలు శ్రీనివాసరావు, ఎల్.ఎస్ నాయుడు, ఎస్‌బి సిఐ లక్ష్మణమూర్తి, ఎస్‌ఐలు లక్ష్మణ్, ప్రసాద్, సీనియర్ సిటిజన్లు, సంఘ సేవకులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'బెదురులంక' సందడి



మాట్లాడుతున్న హీరో కార్తికేయ

**శ్రీకాకుళం అర్బన్ :** తెలుగు చిత్రపరిశ్రమలో నటీనటులు పోటీపడి సినిమాలు చేస్తున్నారని సినీ హీరో కార్తికేయ అన్నారు. మంచి సినిమాలుగా ప్రేక్షకాదరణ పొందితే సినీ పరిశ్రమలో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. నగరంలోని సూర్యమహల్‌లో 'బెదురులంక 2012' చిత్ర బృందం మంగళవారం సందడి చేసింది. థియేటర్‌లో చిత్ర ప్రదర్శన సమయంలో ఆయన హాజరై ప్రేక్షకులకు అభివాదం చేశారు. బెదురులంక సినిమా ప్రేక్షకాదరణ పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తెలుగు చిత్రసీమకు జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ గుర్తింపు తీసుకొచ్చారని, ఈ అవార్డు రావడం టాలీవుడ్‌కే గర్వకారణమన్నారు. యువ హీరోలందరూ అర్జున్‌ను ఆదర్శంగా తీసుకొని మరింత కష్టపడతామన్నారు. త్వరలో యువి క్రియేషన్ బ్యానర్‌లో కొత్త సినిమా ప్రారంభం రాబోతోందని తెలిపారు.

## యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ

- మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ
- ఇసుక అక్రమ రవాణాపై నిరసన

ప్రజాశక్తి - కొత్తూరు

వైసిపి ప్రభుత్వంలో సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోందని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ విమర్శించారు. మండలంలోని మాతల, నివగాం ఇసుక ర్యాంపుల వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టేందుకు బయలుదేరిన ఆయన్ను పోలీసులు మంగళవారం గృహ నిర్బంధం చేశారు. పోలీసుల కళ్లుగప్పి వచ్చిన ఆయన కలమట పాలకొండ, హడ్డుబంగి రహదారిపై బైఠాయించారు. ఆయనతో పాటు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలమట మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలపై అధికారులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేయాలన్నారు. అనంతరం తహాశీల్దార్ ఎం.చక్రవర్తి, సిఐ ఆర్.వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మోహనరావు, ఎ.అరుణ్‌కుమార్, ఎల్.భగవాన్‌దాస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



రహదారిపై బైఠాయించిన టిడిపి నాయకులు

## ప్రతి గడపకు తాగునీరు

ప్రజాశక్తి - బూర్జ

ప్రతి గడపకు తాగునీరు అందిస్తామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొల్లివలసలో సుమారు రూ.68 లక్షలు, సంకురాదలో సుమారు రూ.24 లక్షలు, నీలాదేవిపురంలో సుమారు రూ.74 లక్షలతో జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయి కార్యక్రమానికి స్పీకర్ సీతారాం మంగళవారం శంకుస్థాపన చేశారు. బూర్జలో రూ.36.34 లక్షలతో అంతర్గత కాలువలకు శంకుస్థాపన చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో రేషన్‌కార్డుల కోసం అర్జీలు పెట్టుకున్న లబ్ధిదారులకు స్పీకర్ చేతుల మీదుగా కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. బూర్జ, శంఖురాడలో సమగ్ర భూ సర్వే పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటికి జల జీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి కె.దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, డిసిసిబి డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, సర్పంచ్‌లు జీడి వేణు, జల్లు ఆదినారాయణ, అనురాధ, వైస్ సర్పంచ్ తొత్తడి కృష్ణ, ఎంపిటిసి మజ్జి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## 1న ధర్మపోరాట నిరసన

**శ్రీకాకుళం అర్బన్ :** సిపిఎస్ ఉద్యోగుల జీవితాల్లో చీకటి రోజైన సెప్టెంబర్ ఒకటో తేదీన కలెక్టరేట్ వద్ద ధర్మ పోరాట నిరసన కార్యక్రమం చేపడుతున్న సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చల్లా దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షులు గురుగుబెల్లి భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సిపిఎస్ ఉద్యోగులకు తీపికబురు అంటూ దగా చేసి అశాస్త్రీయ జిపిఎస్ విధానాన్ని ప్రకటించడం దారుణమన్నారు. విధి విధానాలపై కనీసం ఉద్యోగ సంఘ నాయకులతో చర్చించకుండా ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో అంపోలు షణ్ముఖ రావు, బి.శ్యామ్ కుమార్, జయమ్మ, విజయ్, చిన్నాల కన్నయ్య, రవితేజ గోవింద్ పట్నాయక్, దాసరి సతీష్, రవి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

న్యాయవాదుల రక్షణ చట్టం పటిష్టం చేసి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. విజయవాడలో న్యాయవాది ఆవుల ప్రవీణ్ కుమార్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయడాన్ని, బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు తగరం కిరణ్‌బాబుపై వీరవల్లి పోలీస్ అధికారులు పెట్టిన కేసులను నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. జిల్లా కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై ఇటీవల దాడులు పెరుగుతున్నాయని, ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, అన్నెపు భువనేశ్వరరావు, బిసి అడ్వకేట్ సంఘం అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వరరావు, భాస్కరరావు, హరిప్రియ, సీనియర్ న్యాయవాదులు కూన అన్నంనాయుడు, సనపల హరి, దుంపల రమణారావు, ఎన్ని రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

# తెలుగు భాష పితామహుడు 'గిడుగు'


టెక్కలి : విద్యార్థిని అభినందిస్తున్న పగడాలమ్మ


శ్రీకాకుళం అర్బన్ : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ


సంతబొమ్మాళి : బోరుభద్రలో 'అ' అక్షరంలో కూర్చున్న విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతిఒక్కరూ తెలుగు బాషను మాట్లాడడంతో పాటు పిల్లలకు తెలుగుభాష గొప్పతనాన్ని తెలియజెప్పాలని, అప్పుడే తెలుగు భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులకు మనమిచ్చే గౌరవమని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం పలు సంస్థలు, విద్యాలయాల్లో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని గాంధీ మందిరంలో అవధాన పండితులు పైడి హరనాథరావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు డాక్టర్ జామి భీమశంకరరావు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నిక్కు అప్పన్న, నటుకుల మోహన్, బరాటం లక్ష్మణరావు, కొంక్యాన వేణుగోపాల్, పందిరి అప్పారావు, డాక్టర్ బాడాన దేవభూషణరావు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం డిగ్రీలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు టి.భాగ్యశ్రీ, బి.సుకన్య, కె.రమాదేవిలకు ప్రోత్సాహకాలను అందజేశారు. గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె.మూర్తి మాట్లాడుతూ భాషావుద్యమనేతల రుణాన్ని తీర్చుకునేలా విద్యార్థులు సామాజికసేవల్లో పాల్గొవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తెలుగు విభాగ అధిపతి డాక్టర్ పి.వి.రమణ, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ జి.రాజశేఖర్, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ హరిత, తెలుగు అధ్యాపకులు పి.నారాయణరావు పాల్గొన్నారు.

**ఆమదాలవలస :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్.స్వామి, తెలుగు విభాగాధిపతి బి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్, ఉషా పద్మి, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ సాయికుమార్, అధ్యాపకులు అష్టలక్ష్మి, రాజశేఖర్, జగన్నాథరావు, ప్రసాదరావులు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

సరుబుజ్జిలి మండలంలోని పర్వతాల పేట గ్రామంలో గిడుగు రామ్మూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పేడాడ రామ్మోహనరావు ఘనంగా నివాళలర్పించారు.

**రణస్థలం రూరల్ :** స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బి.రమణయ్య ఆధ్వర్యాన తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్రపాటలకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. తెలుగు అధ్యపకులు జి.రవికుమార్, పీడీ ఆర్.హైమ, డి.రాజశేఖర్, కె.వి.రమణయ్య, ఐ.వాణి పాల్గొన్నారు.

**టెక్కలి :** మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డివిజనల్ ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ, ఎంఇఒ దల్లి తులసిరావు రెడ్డి, ప్రధానోపాధ్యాయులు డి.భారతి రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణపతి, టి.ధర్మారావు, శ్యామలరావు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఓక్లాండ్ ఆంతర్జాతీయ పాఠశాల్లో ప్రిన్సిపాల్ మల్లా మధులత ఆధ్వర్యాన విద్యార్థులు వేసిన వేషదారణలు ఆకట్టుకున్నాయి. తలగాం ఎట్ నౌపడా ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు ఎ.ధర్మారావు, ప్రణవి డిగ్రీ కళాశాల ఆవరణలో చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పేడాడ చంద్రశేఖర్ఆజాద్, పేడాడ సూర్యనారాయణ, నర్తు కృష్ణారావు పాల్గొన్నారు.

**నందిగాం :** మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిలుక కృష్ణారావు, ఉపాధ్యాయులు దుంపా శ్రీనివాస్, బాలక రామారావు, రంకిడి రామారావు, తులసీప్రసాద్, బెందాళం రత్నం, ఇందిరాభాయ్, యాగాటి త్రినాథరావు పాల్గొన్నారు.

**లావేరు :** లావేరు శాఖాగ్రంథాలయంలో రామ్మూర్తి చిత్రపటానికి గ్రంథాలయధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయం తరుపున అందజేశారు. బుడుమూరు ఉన్నత పాఠశాలలో మాతభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఉరిటి శ్రీనివాసరావు మాతభాష ఔన్నత్యాన్ని గుర్తు చేశారు. .

**ఎచ్చెర :** మండలంలోని పొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామ్మూర్తి చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు ఎల్.అమ్మాజీ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పాఠశాల తెలుగు సహాయకులు ఎం.విష్ణు, ఉపాధ్యాయులు బాబూరావు, టి.బాలకృష్ణకుమార్, కె.శ్రీనివాసరావు, ఎం.సునీల, లక్ష్మి పాల్గొన్నారు.

**శ్రీకాకుళం :** శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ప్రజా రవాణా అధికారి ఆకాశపు విజయకుమార్ రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్, శ్రీకాకుళం ఆర్‌టిసి 1,2 డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

**సంతబొమ్మాళి :** సంతబొమ్మాళి గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ, బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, మరువాడ ఎంపియుపి పాఠశాలలో వైసిపి ఇన్‌ఛార్జి గంట ఈశ్వరరావు, సూరాడ దాసురాజు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేశారు. బోరుభద్ర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 'అ' అక్షరంలో కూర్చున్నారు. కార్యక్రమంలో బాడాన రాజు, రాజు పాల్గొన్నారు.

**సోంపేట :** మండలంలోని బేసి రామచంద్రపురం ఉన్నత పాఠశాలలో తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పద్య పోటీలను నిర్వహించారు. అలాగే విద్యార్థులు ప్రదర్శించిన వివిధ జాతీయ నాయకులు, కవుల వేషధారణలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రామస్వామి, బ్రహ్మానందం, రాజేంద్ర కుమార్, సాయిరాజ్, ప్రకాష్, మాధవరావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

**పలాస :** ప్రజా సంస్కృతిక వేదిక ఆధ్వర్యాన కాశీబుగ్గ రంగం కార్యాలయంలో రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కొనారి హేమసూదన్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దుబ్బ రాజగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు బెందళం రాజేష్, సీనియర్ జర్నలిస్ట్ జగదీష్, పరపతి మూర్తి పాల్గొన్నారు.

**బ్రాహ్మణతర్లలో...**

**పలాస:** మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాష దినోత్సవం, క్రీడా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీకృష్ణదేవరాయలు భువనవిజయం, కవులు వేషధారణలో ప్రదర్శించిన సాంస్కతి కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, కథలు, క్విజ్, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు చెల్లూరు పద్మలోచన, తెలుగు ఉపాధ్యాయులు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

**శ్రీచైతన్య పాఠశాలలో**

స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ప్రదర్శించిన పలు సాంస్కతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల రీజనల్ ఇన్‌ఛార్జి రామనాయుడు, కో ఆర్డినేటర్ బాలరాజు ,ప్రిన్సిపాల్ రామకష్ణ, వైస్ ప్రిన్సిపాల్ రాము, డీన్ కోటి, అసోసియేట్ డీన్ షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

**నౌపడ:** సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోత చైతన్య ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద కేసు నాయుడుపేట మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం గిరిధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నౌపడశాఖ గ్రంథాలయంలో ఇన్చార్జి గ్రంథాలయ అధికారిని బి.రూపావతి ఆధ్వర్యాన తెలుగు భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

**టెక్కలి రూరల్ :** జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలు చాకిపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఎం అనురాధల ఆధ్వర్యంలో జరిగాయి. ఆయా చిత్ర పటాలను పూలమాలలు వేసి నివాళలర్పించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బాడాన నారాయణరావు, తెలుగు ఉపాధ్యాయులు కింజరాపు భారతి, బగాది ఆనందరావు. జగదీష్, దాలయ్య, నారాయణరావు, చిన్నరావు, ఋషి, తదితరులు పాల్గొన్నారు.

**జలుమూరు :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. విద్యార్థులు పలు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1, ఎంఈఓ-2 బమ్మిడి మాధవరావు, ప్రసాద్ రావు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

**కవిటి :** గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చి, భాషలో ఉన్న అందాన్ని, విలువని తెలియజేసిన అచ్చ తెలుగు మాస్టారు గిడుగు వెంకట రామమూర్తి అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, తెలుగు అధ్యాపకుడు పేడాడ రాజేశ్వరరావు, కవిటి, శిలగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బెందాళం మల్లేశ్వరరావు, కాశీపట్నం పేర్రాజు అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల, కవిటి కొత్తూరు బివికె పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కవిటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కల్యాణి ఆంగ్ల పాఠశాల, ఇద్దివానిపాలెం, బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, కో ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిటిసి పూడి నీలాచలం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి విద్యార్థినులకు తెలుగు భాష ప్రాముఖ్యతను కళాశాల ప్రిన్సిపాల్ రోబిన్ కుమార్ పాడి తెలిపారు. ఈ కార్యక్రమం వైస్ ప్రిన్సిపాల్ శుషంత జెన్నా , శ్రీనివాసరావు, లోకేస్వార రావు, శివకుమార్, సంతోష్ కుమార్ ,దుర్యోధన, వరప్రసాద్, సీతమ్మ, బందావనం పాల్గొన్నారు.

**విశాఖ స్కూల్‌లో....**

**శ్రీకాకుళం :** స్థానిక బ్యాంకర్స్ కాలనీలోని విశాఖ స్కూలులో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు జరిగాయి. వ్యవహారిక బాషోద్యమ ఉద్యమకర్త గిడుగు రామమూర్తి సేవలను స్కూల్ చైర్మన్ డాక్టర్ కె. మధుసూదన్ వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి రామారావు , తెలుగు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆయన కృషిని ప్రశంసించారు. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు.

**జిల్లా కేంద్ర గ్రంథాలయంలో...**

శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి 160వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు పూలమాలన వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, కె.చిరంజీవులు, ప్రత్యూష, పి.రామమోహన్, టి.రాంబాబు పాల్గొన్నారు.

**సన్ డిగ్రీ కళాశాలలో...**

గొప్ప సాహిత్యం తెలుగు వైభవ రీతికి నిదర్శనం గిడుగు రామమూర్తి పంతులు అని సన్ డిగ్రీ,పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ పొన్నాన జయరాం అన్నారు. స్థానిక సన్ డిగ్రీ,పీజీ కాలేజీలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. మార్నింగ్ రాగా డిజిటల్ డైలీ సంపాదకులు రత్నకిశోర్ శంభుమహంతి మాట్లాడుతూ నవ్య రీతులలో ఉండే సాహిత్యాన్ని మరింత ప్రోత్సహించేందుకు తమ సంస్థ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. తెలుగు అధ్యాపకులు సంపతిరావు భవానీ ప్రసాద్ నేతత్వాన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఎల్.కామేశ్,పి.జయరాం, పి.మురళీ కష్ణ,మ్యాథ్స్ లెక్చరర్ ఎస్.కొండలరావు,కెమిస్ట్రీ లెక్చరర్ పి.గోవింద్,మ్యాథ్స్ లెక్చరర్లు రమేశ్ నాయుడు, జగన్, బోధనా,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వ్యాస రచన,వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందించారు.

**రణస్థలం:** తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో భాగంగా మైటాస్ ఐ కనెక్ట్, నేషనల్ ఎడ్యుకేషనల్ అండ్ ఎన్విన్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవహార భాషా కర్త గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకల సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించారు. శ్రీకాకుళం న్యూ సెంట్రల్ స్కూల్లో జిల్లా వ్యాప్తంగా తలపెట్టిన పోటీలలో 140 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా రణస్థలం ఐరిస్ సఖల్య అకాడమీ స్కూల్ విద్యార్థులు జమున, భాగ్యలక్ష్మి, రుహన్ సాయి తమ ప్రతిభను కనబరిచారు. జిల్లాలో 4వ స్థానం సాధించారు. విద్యార్థులకు చైర్మన్ కొమనాపల్లి హరికష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ స్వాతి పద్మజా, తెలుగు పండితులు రామకష్ణ తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

**బూర్జ :** జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లా వెంకట లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పిల్లలకు క్రీడా పోటీలు, క్విజ్ కాంపి, నత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు.

**బారువ కొత్తూరులో...**

**సోంపేట :** మండలంలోని బారువ కొత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.. పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు తారకేశ్వరరావును విద్యార్థుల్లోతో పాటు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రదర్శితమైన జాతీయ నాయకుల, భరతమాత వేషధారణల పాత్రలు అలరించాయి..

**జి.సిగడాం :** మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో , సంతవురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఏపీ మోడల్ స్కూల్‌లో ఘనంగా మాతభాషా దినోత్సవం, స్పోర్ట్స్ డే ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ లంక అన్నా శామ్యూల్, జి సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, కేజీబీవీ ప్రిన్సిపల్ ఉషారాణి, హెచ్ఎం టి.జయలక్ష్మిలు మాట్లాడారు..

**వజ్రపుకొత్తూరు :** మాత భాషకు మించిన భాష మరొకటి లేదని ప్రధానోపాధ్యాయులు కె.హరిబాబు అన్నారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, మాతృభాషా దినోత్సవాన్ని పాఠశాల హెచ్ఎం ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ నాగరాజు, తెలుగు ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి పాల్గొన్నారు.


సోంపేట : తారకేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


వజ్రపుకొత్తూరు : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


శ్రీకాకుళం : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మధుసూదన్

# భవన నిర్మాణాల పూర్తికి చర్యలు


మాట్లాడుతున్న ఎంపిడిఒ హరిహరరావు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో పలు గ్రామాల్లో చేపడుతున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్‌హెల్త్ క్లీనిక్ వంటి ప్రాధాన్యత భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపిడిఒ సీపాన హరిహరరావు అన్నారు. పొందూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లతో మంగళవారం సమీక్షించారు.

ఈ సందర్భంగా ప్రతినెలా చివరి శుక్ర, శనివారాల్లో ప్రభుత్వ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ సర్వే చేపట్టాలని అన్నారు. అలాగే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయాలకు ఇచ్చిన రూ.20 లక్షల నిధులతో పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, ఇఒ మురళీకృష్ణ, ఎంఇఒ రామరాజు పాల్గొన్నారు.

# గోకర్ణపల్లి కార్యదర్శి సస్పెన్షన్

## ఇఒపిఆర్‌డికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక వైసిపి నాయకుల ఒత్తిడికి తలొగ్గి ఓటర్ లిస్టును తారుమారు చేసి అక్రమాలకు పాల్పడిన గోకర్ణపల్లి పంచాయతీ సచివాలయ కార్యదర్శి పి.గోవిందరావుపై ఎన్నికల కమిషన్ సస్పెన్షన్ వేటు వేయగా, ఇఒపిఆర్‌డి వి.మురళి షోకాజ్ నోటీసులను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ జారీ చేసినట్లు డిపిఒ రవికుమార్ ఒక ప్రటకలో తెలిపారు. మండలంలోని గోకర్ణపల్లి పంచాయతీ 2 వార్డు సభ్యునికి ఈ నెల 19న ఉప ఎన్నిక జరగాల్సి ఉండగా ఓటర్ జాబితాను ట్యాంపరింగ్ చేసి లిస్టులో ఉన్న ఓటర్లను తొలగించి ఇతర వార్డుల్లో తమకు అనుకూలంగా ఉన్న ఓటర్లను అధికార పార్టీ వారు ఇందులో చేర్పించారు. దీంతో మదర్ ఓటర్ లిస్టుకు, పంచాయతీ కార్యదర్శి రూపొందించిన ఓటర్ లిస్టుకు చాలా వ్యత్యాసం ఉందంటూ పోటీ అభ్యర్థితో పాటు టిడిపి నాయకులు కలెక్టర్‌కు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో అందజేసిన ప్రాథమిక ఆధారాలతో ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికను వాయిదా వేసింది. పూర్తి విచారణ అనంతరం ఓటర్ లిస్టులో అక్రమాలు వాస్తవమని తేలడంతో పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయడంతో పాటు, ఇఒపిఆర్‌డికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు.

# వ్యక్తిత్వ వికాస సదస్సు

ప్రజాశక్తి- రణస్థలం

చిలకపాలెం శ్రీ శివాని ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులనుద్దేశించి బి.అర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ హనుమంతు లజపతిరాయ్ వ్యక్తిత్వ వికాసంపై మాట్లాడారు. అంతేకాకుండా ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. .ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. టి చంద్ర శేఖర్, మొదటి సంవత్సరం విభాగాధితి కె మధు కుమార్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆర్మీ కాలింగ్ సంస్థ డైరెక్టర్ రమణకు అవార్డు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ రక్షణకు నిరంతరాయంగా శ్రమించే సైనికులను తయారు చేస్తున్న ఇండియన్ ఆర్మీ కాలింగ్ సెంటర్ శ్రీకాకుళం డైరెక్టర్ బి.వి.రమణకు అరుదైన గౌరవం దక్కింది. ఆయన సేవలకు మెచ్చి బిహెచ్ఆర్‌సి అందిస్తున్న అశోక్ అవార్డు సొంతం చేసుకున్నారు. మిలటరీ విధుల్లో ఉన్న సైనికులు, విశ్రాంత సైనికులు యువతకు సైనిక శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటైన ఈ సంస్థ గ్రామ గ్రామాన విద్యార్థులకు దేశంపై గౌరవాన్ని పెంపొందించేందుకు సంస్థ నిరంతరంగా శ్రమిస్తోందని, అందులో భాగంగా జిల్లాలో పోలీసుశాఖకు అండగా నిలుస్తూ బందోబస్తు సమయంలో భాగస్వాములవుతున్నారు. మరో వైపు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తు ప్రజాసేవలో అంతర్భాగమవుతున్నారు. ఈ సేవలను మెచ్చి భారతీయ మానవ హక్కుల పరిపాలన సంస్థ (బిహెచ్ఆర్‌సి) సంస్థ నుంచి అశోక్ అవార్డుకు ఆర్మీ కాలింగ్ సంస్థ శ్రీకాకుళం యూనిట్ సొంతం చేసుకుంది.

ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అదనపు క్రైమ్ ఎస్‌పి టి.పి.విఠలేశ్వర్, అదనపు అడ్మిన్ అడిషనల్ ఎస్‌పి జె.తిప్పిస్వామిలు ఈ అవార్డును బి.వి.రమణకు అందజేశారు. కార్యక్రమంలో బిహెచ్ఆర్‌సి చైర్మన్ పూర్ణచంద్ర సాహూ, మంత్రి డాక్టర్ వెంకటస్వామి డాక్టర్ టి.మణికంఠ పాల్గొన్నారు.


అవార్డును స్వీకరిస్తున్న డైరెక్టర్ రమణ

# 1 నుంచి 'బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ'

## టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష


మాట్లాడుతున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

ప్రజలకు అండగా ఉండేందుకు సెప్టెంబరు 1 నుంచి బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నామని, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. స్థానిక ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో నియోజకవర్గం పరిధిలోని టిడిపి నాయకులకు, కార్యకర్తలకు మంగళవారం రాబిన్ శర్మ టీమ్, అజెయ్, సిద్దార్థ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 45 రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేసి ప్రజలకు చేరువ కావాలన్నారు. శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విఠల్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మందస మండల పార్టీ అధ్యక్షుడు దుర్యోధన, గాలి కృష్ణ, మల్లా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులు రుద్రయ్య, నవీన్, సంతోష్, కర్ని రమణ పాల్గొన్నారు.

# సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

**పోలాకి :** సాంకేతికతకు అనుగుణంగా రైతులు దశలవారీగా నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే కృష్ణదాస్ అన్నారు. మండలంలోని మబగాంలో డ్రోన్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారీ చేయడానికే పరిమితం కాకుండా... విత్తనాలు, ఎరువులు పిచికారీ చేయాలన్నారు. డ్రోన్లను సరైన తీరులో వినియోగించడం ద్వారా సాగులో పురుగు మందులు, ఎరువుల వృధాను అరికట్టవచ్చని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీధర్, వ్యవసాయ సలహా మండల అధ్యక్షులు శిమ్మ నేతాజీ, ముద్దాడ భైరాగినాయుడు పాల్గొన్నారు.

# 'ఆహా' క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

పేద ప్రజలకు కడుపునిండా భోజనం పెట్టేందుకే ఆహా క్యాంటీన్ నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాసలో మెప్మా ఆధ్వర్యాన ఆహా క్యాంటీన్‌ను మెప్మా అధికారులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ పలాస-కాశీబుగ్గ జంట పట్నాలకు ఇతర ప్రాంతాల నుంచి ఎంతోమంది వివిధ పనులు, కూలి పనులు చేసేందుకు వచ్చిన కార్మికులకు భోజనం పెట్టాలని ఉద్దేశంతో రూ.40 లకే అందిస్తున్నామని తెలిపారు. ఆహా క్యాంటీన్ ద్వారా రోజూ భోజనం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా పీడీ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, కృష్ణారావు, కో-ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


భోజనం అందిస్తున్న చైర్మన్ గిరిబాబు

## రేపు ఉచిత వైద్య శిబిరం


దీప, ఎంపిపి

**బూర్జ :** మండలంలోని లక్కుపురంలో పాలకొండ శ్రీవిజయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఈ నెల 31న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిసున్నామని ఎంపిపి కర్నేని దీప ఒక ప్రకటనలో తెలిపారు. గర్భిణులకు, చిన్నారులకు, కీల నొప్పులతో బాధపడుతున్న రోగులకు, ఆర్థో వంటి దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే బిపి, సుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారని అన్నారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. లక్కుపురం, కొత్తలక్కుపురం, కొత్తవలస, పాలవలస, రామన్నపేట, మర్రిపాడు, పనుకుపర్త, వై.పర్త, కిలంతిరి, అల్లెన, జి.వి.పురం, గదబవలస పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఎరువులు పంపిణీ చేస్తున్న జగన్నాయకులు

## పిఎసిఎస్‌లో ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి - సంత బొమ్మాళి

సంతబొమ్మాళి పిఎసిఎస్ కార్యాలయంలో ఆ చైర్మన్ కెల్లి జగన్నాయకులు అధ్యక్షతన మంగళవారం ఎరువులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పిఎసిఎస్‌లో 20 టన్నుల యూరియా అందుబాటులో ఉంది. 40 టన్నుల డిఎపి, 60 టన్నుల యూరియా మర్కెఫెడ్ వారికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మెంబర్ లుపిలక రవికుమార్ రెడ్డి, మార్పు నాగభుషణరావు, సిఇఒ మాధురి, అగ్రికల్చర్ అస్సిస్టెంట్ సాయి, సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ నగర్‌లో చోరీ

**టెక్కలి రూరల్:** స్థానిక శ్రీనివాస్ నగర్‌లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులు హైమావతి ఇట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైమావతి, గోవిందరావు దంపతులు శ్రీనివాస్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. హైమావతి సంతబొమ్మాళి మండలం మూలపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గోవిందరావు స్థానికంగా రైస్ మిల్లు నిర్వాహకుడు. హైమావతికి ఆరోగ్యం కారణంగా సోమవారం సాయంత్రం భార్యాభర్తలు వాండ్రాడలోని ఆమె కన్నవారి ఇంటికి వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం అక్కడి నేరుగా పాఠశాలకు వెళ్లిపోయింది. పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులకొట్టి ఉండాన్ని చూసి లబోదిబోమని లోపల వెళ్లింది. ఇంట్లోని బీరువా తెరిచి నాలుగు బంగారు ఆభరణాలు, రూ.2 వేలు నగదు అపహరణకు గురైందని గుర్తించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ, క్లూస్ టీం బృందం పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జూదరుల అరెస్టు

**టెక్కలి రూరల్ :** మండలంలోని సవరకిల్లి సమీపంలోని తోటలో పేకాట శిబిరంపై మంగళవారం దాడి చేశామని ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బంది వెళ్లి దాడి చేశామన్నారు. పది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద రూ.16,250 నగదును స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## 'సమరభేరి' పోస్టర్ ఆవిష్కరణ

**కొత్తూరు :** సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 30 నుంచి సమర భేరి నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, నాయకులు నిమ్మక అప్పన్న పిలుపునిచ్చారు. కొత్తూరులోని సమర భేరి పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై వేయడంపై కొత్తూరులో సంతకాలను సేకరిస్తున్నామని అన్నారు. పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్లు రాయితీ ఇస్తూ పేదలపై భారాలు మోపుతున్నారని అన్నారు.

## కౌన్సిల్ ముఖ్య సలహాదారునిగా శ్రీనివాసరావు

**సోంపేట :** భారతీయ మానవ హక్కుల కౌన్సిల్ ముఖ్య సలహాదారునిగా సోంపేటకు చెందిన దుద్ది శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి జునైడ్ అహ్మద్ మౌలానా, క్రైమ్ బ్రాంచ్ అదనపు ఎస్‌పి విఠలేశ్వర్, జిల్లా అదనపు ఎస్‌పి తిప్పేస్వామి, మానవ హక్కుల కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు పూర్ణచంద్రరావులు నియామక పత్రాన్ని అందజేశారు. వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నందున ఈ నియామకం చేపట్టినట్లు చైర్మన్ తెలిపారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాసరావు



జి.సిగడాం : తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపి మోడల్ స్కూల్‌లో జాతీయ నాయకుల చిత్రపటాలతో తెలుగు వర్ణన

## పరిష్కారం కాని వివాదం

ప్రజాశక్తి- పలాస

జీడి వ్యాపారుల, కార్మికుల మధ్య చిన్నపాటి తగాదా ఘర్షణకు దారి తీసింది. ఇరువురి మధ్య తోపులాట జరగడంతో సంయుక్త సమావేశాన్ని వాయిదా వేశారు. జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం భవనంలో కార్మికుల, వ్యాపారుల మధ్య మంగళవారం సమావేశం నిర్వహించారు. రెండేళ్లగా వ్యాపారి పొట్నూరు బాలయ్య జీడి పరిశ్రమలో జీడి పప్పు మాయం అవుతున్నట్లు గుర్తించారు. దీనివల్ల తరచూ నష్టం వస్తుండడాన్ని గుర్తించి వ్యాపారుల సంఘానికి ఫిర్యాదు చేసి తనకు న్యాయం చేయమని కోరారు. దీనికి మొత్తం 16 మంది కార్మికలపై అనుమానం వ్యక్తం చేశారు. కార్మిక సంఘానికి చోరీ విషయం తెలిజయేసి సంయుక్త సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీంతో ఇరు గ్రుపుల నాయకులతో సమావేశం నిర్వహించారు. అందరినీ బాధ్యులను చేయడం తగదని కార్మిక సంఘం నాయకులు తమ వాదని వినిపించారు. తమకు జరిగిన నష్టానికి ఎవర్ని బాధ్యులను చేయగలమని వ్యాపారులు స్పష్టం చేశారు. చివరకు బాధిత వ్యాపారి ఓ కార్మికుడి పేరు చెప్పకుండా ఆరోపణ చేయడంతో ఘర్షణ నెలకొంది. ఓ కార్మికుడు వ్యాపారిపై దురుసుగా వ్యవహరించినట్లు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. దీంతో సంయుక్త సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. కార్యక్రమంలో పిసిఎంఎ అధ్యక్షుడు మల్లా సురేష్ కుమార్, కార్యదర్శి కె.వి.శివకృష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్, శాసనపురి మురళీకృష్ణ, వల్లా భాస్కరరావు, బెల్లాల నారాయణరావు, కొత్తకోట తిరుమలరావు, కార్మిక సంఘ అధ్యక్షుడు భీమారావు, ప్రధాన కార్యదర్శి బొమ్మాళి తాతయ్య, మాజీ కార్యదర్శి బొంపల్లి సింహాచలం, సిఐటియు నాయకులు ఎన్.గణపతి, అంబటి ఆనందరావు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జీడి కార్మిక సంఘం నాయకులు కృష్ణమూర్తి

# ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో రాణించాలి



ఎచ్చెర్ల : మాట్లాడుతున్న జగదీశ్వరరావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మూడుసార్లు గోల్డ్ మెడల్ సాధించి దేశానికి గొప్ప గుర్తింపు తెచ్చిన వ్యక్తి ధ్యానచంద్ అని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ట్రిబుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ జగదీశ్వరరావు అన్నారు. ట్రిపుల్ ఐటిలో విద్యార్థులకు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో రాణించాలనే జిజ్ఞాస, ఉత్సహం ఉంటే తప్పకుండా జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధిస్తారని హితవుపలికారు. విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించాలన్నారు. కార్యక్రమంలో పీడీ రాజు, భాస్కరరావు, దిలీప్‌కుమార్, శ్రీవల్లి, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, గేదెల రవి పాల్గొన్నారు.

**టెక్కలి :** జాతీయ క్రీడాకారుడు ద్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. ముందుగా ద్యాన్‌చంద్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు ఎ.అనురాధ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, మోహిణీ, కురమాన దాలయ్య, రమేష్, క్రాంతి పాల్గొన్నారు. అలాగే స్థానిక ఓక్లాండ్ అంతర్జాతీయ పాఠశాలలో ప్రిన్సిపాల్ మల్లా మధులత ఆధ్వర్యాన క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఆట ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి చాటిన ధ్యాన్ చంద్ స్ఫూర్తి నేటి తరానికి అవసరం అని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస, కాశీబుగ్గ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కాశీబుగ్గ, పలాస ఉన్నత పాఠశాలల్లో ధ్యాన్ చంద్ విగ్రహాలకు పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆటల్లో ప్రతిభ సాధించిన వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు చిన్నంనాయుడు, డి.దాశరథి, కె.హరిబాబు, రాష్ట్ర పీఈటీ సంఘ సంయుక్త కార్యదర్శి పి.తవిటయ్య, పీడీలు సిహెచ్. పద్మలోచనం, గజేంద్ర, ఎస్. రామారావు, బి.శంకరరావు, శ్రీనివాసరావు, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**అక్షరాల ఆకారంలో...**

మండలంలోని రామకష్ణపురం సత్యసాయి విద్యా విహార్ పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా ఎన్‌ఎస్‌డి అక్షరాల ఆకారంలో కూర్చుని ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, తెలుగు ఉపాధ్యాయులు మురళి, సాంబశివరావు, ఉమ, జగదీశ్వరి, పిఇటి కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.




టెక్కలి : ప్రదర్శన నిర్వహిస్తున్న 'ఓక్లాండ్' విద్యార్థులు

**పోలాకి :** మండలంలోని ఈదులవలస ఎపి మోడల్ స్కూల్ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని కీర్తిశేషులు ముద్దాడ విజయ వెంకట అప్పలనాయుడు మెమోరియల్ వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విజేతలకు జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య మంగళవారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్ దాస్, రమాదేవి, ముద్దాడ రాహుల్, ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, సర్పంచ్ ముద్దాడ భాస్కర్‌నాయుడు, ముద్దాడ బాలభూపాల్‌నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం, సదాశివ కృష్ణ పాల్గొన్నారు.

# న్యాయవాదులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి – ఆమదాలవలస

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం రాష్ట్రంలో పలుచోట్ల న్యాయవాదులపై జరిగిన దాడులకు నిరసనగా విధులను బహిష్కరించి కోర్టు ఆవరణలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల బెజవాడ బార్ అసోసియేషన్ మెంబర్ తగరం కిరణ్ బాబుపై వీరవల్లి పోలీస్ స్టేషన్ కు చెందిన పోలీస్ అధికారులు ఒక తప్పుడు కేసును ఆయనపై నమోదు చేసి చిత్రహింసలకు గురిచేసి అట్రాసిటీ కేసులో బాధ్యుడిగా పేర్కొంటూ తప్పుడు కేసులు పెట్టినందుకు అలాగే అదే బార్ అసోసియేషన్ మెంబర్ ఆవుల ప్రవీణ్ కుమార్ న్యాయవాదిపై గుర్తు తెలియని దుండగులు విచక్షణారహితంగా భౌతిక దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలపై న్యాయవాదులమంతా సంఘీభావం తెలుపుతూ కోర్టు విధులను బహిష్కరించామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తమ్మినేని అన్నం నాయుడు, గురుగుబెల్లి ప్రభాకర రావు, ఐలు నాయకుడు బొడ్డేపల్లి మోహన రావు, కూన గణపతి, బోడిగి హరీష్ తదితరులు పాల్గొన్నారు.



సోంపేట : విధులను బహిష్కరించిన న్యాయవాదులు

**సోంపేట :** సోంపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక న్యాయవాదులు విధులు బహిష్కరించారు. విజయవాడకు చెందిన తగరం కిరణ్‌పై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేయడానికి నిరసనగా విధులు బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగభూషణరావు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

## టిడిపితోనే మహిళాభివృద్ధి

### టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి ప్రకటించిన మహాశక్తి పథకాలతోనే మహిళాభివృద్ధి సాధ్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని వెదుళ్లవలసలో మహాశక్తి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ సిఎం చంద్రబాబునాయుడు రూ.200 పింఛనును రూ.2 వేలుకు పెంచారని గుర్తు చేశారు. ఇటీవల నిర్వహించిన మహానాడులో టిడిపి ప్రకటించిన మహాశక్తి పథకాల్లో తల్లికి వందనం పథకంలో భాగంగా 18 నుంచి 60 ఏళ్ల లోపల మహిళలకు ఇంటిలో ఎంతమంది ఉంటే వారందరికీ నెలకు రూ.1500 చొప్పున బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రములో జిల్లా మహిళా అధ్యక్షులు మెట్ట సుజాత, మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత, తమ్మినేని చంద్రశేఖర్, సనపల ఢిల్లేశ్వరరావు, ఎంపిటిసిలు బొడ్డేపల్లి సుగుణ, అన్నెపు భాస్కరరావు, సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, వండాన ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

**పలాస:** టిడిపికు మహిళా శక్తి అధికమని, టిడిపి గెలుపునకు మహిళలే కీలకపాత్ర అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మండలంలోని రెంటికోట గ్రామంలో మంగళవారం సాయంత్రం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో పర్యటించి టిడిపి ప్రవేశ పెట్టనున్న సంక్షేమ పథకాలను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్ రావు, సీనియర్ నాయకులు హెూరియ మోహనరావు, మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ రామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు

## హరికృష్ణకు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

టిడిపి పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు, నందమూరి హరికృష్ణ వర్ధంతి నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో మంగళశారం నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు పాల్గొని హరికృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ ముఖ చిత్రంతో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.100 నాణేన్ని ఆవిష్కరించారు. ఆయనకు దక్కిన అరుదైన గౌరవంగా అభివర్ణించారు. మాజీ సిఎం ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో నగర టిడిపి ఆధ్యక్షులు మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, మహిళా విభాగం ప్రతినిధి కవ్వాడి సుశీల, సురకాశి వెంకటరావు, విభూది సూరిబాబు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి – కవిటి

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. కవిటి మండలం దూగానపుట్టుగ పంచాయతీలో సుమారు 20 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లు, మంచినీటి బోర్లు, ట్యాంకులను మంగళవారం సాయిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి పంచాయతీ అభివద్ధికి నిధులు కేటాయించామని, ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పని చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహూ, సర్పంచులు దూగాన భద్రాచలం, బర్రి ప్రకాష్, స్థానిక నాయకులు ఎస్పీ ప్రవీణ్, రవి, బి మురళి, డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రాజేష్

## విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి – కవిటి

రోజురోజుకు దిగజారుతున్న పరిస్థితులను దష్టిలో ఉంచుకొని విద్యార్థులను భవిష్యత్తు తరాలకు వారధులుగా తయారు చేయాలని జనసేన నాయకుడు లోళ్ల రాజేష్, కవిటి సిహెచ్సి సూపరింటెండెంట్ డాక్టర్ రాంజీ అధ్యాపకులకు సూచించారు. స్థానిక కల్యాణి జూనియర్ కాలేజ్ ఫ్రెషర్స్ డే వేడుకలు లోళ్ల నారాయణమూర్తి కల్యాణ మండపంలో మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాజేష్, డాక్టర్ రాంజీ మాట్లాడుతూ భవిష్యత్ భారతం భావితరాలపై ఆధారపడి ఉందని, దాంట్లో విద్యార్థులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు.. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శంకరరావు, కల్యాణి ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బిందుమాధవి, బల్లెడ రమేష్, ఉమాపతి, కాలేజ్ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## రచనలు సమాజాన్ని జాగృతం చేస్తాయి

**పలాస:** రచనలు సమాజాన్ని జాగృతం చేసి ప్రజలను ఆలోచింపజేస్తాయని గుండె వైద్య నిపుణులు మల్లేశ్వరరావు, డాక్టర్ తెప్పల ఆనంద్, కళింగసీమ సాహిత్య సంస్థ అధ్యక్షులు సన్నశెట్టి రాజశేఖర్‌లు అన్నారు. కాశీబుగ్గ గణపతి రెసిడెన్సిల్లో రచయిత, జర్నలిస్టు వంకల రాజారావు (నిశితాసి) కలంలో జాలువారిన 'కవ్వం' (కవితలు, గేయాల సంపుటి)ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనం బాధలను, గాధాలను వాళ్లకు జరిగే అన్యాయాలను దోపిడీ అణిచివేతలను, ప్రజలు చేసే పోరాటాలను, త్యాగాలను కళింగ సీమ ఆస్తిత్వాన్ని రచయిత వంకల రాజారావు ఒడిసి పట్టి ఉంచిన రచనల సంకలనమే కవ్వమంటూ కొనియాడారు. ప్రజలను ఉత్తేజ పరిచిన పాటలు, కవితల సమహారమే కళింగ సీమ సాహిత్య సంస్థ ప్రచురుణగా ఈ కవ్వం అందుకోవడం సంతోషంగా ఉందని పుస్తక ఆవిష్కర్త డాక్టర్ ఖగేశ్వరరావు అన్నారు. రచయిత వంకల రాజారావు. సమీక్షకులుగా ప్రముఖ కవి స్వామినాయుడు, వక్తలుగా ఉత్తరాంధ్ర జానపద సాహిత్య పరిశోధక రచయిత బర్రి కూర్మారావు, చిక్కోలు జగదీష్, కుత్తుం వినోద్‌కుమార్, రవీంద్రలు, వామసుందర్, అశోక్, సాంబ మూర్తి, సోమేష్, సొర్ర రామారావు, జె.గజలక్ష్మి పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### నేడు, రేపు దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

**పలాస :** ఆంధ్రప్రదేశ్ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ నూతనంగా రిజిస్ట్రేషన్ శాఖలో ప్రవేశ పెట్టబోతున్న కార్డు ప్రైమ్ 2.0 వల్ల దస్తావేజు లేఖరులు, స్టాంప్స్ అమ్మకందారులకు మనుగడ ఉండదని పలాస–కాశీబుగ్గకు చెందిన దస్తావేజు లేఖరులు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం పిలుపు మేరకు బుధవారం, గురువారం రెండురోజులు పాటు నిరసనగా పెన్‌డౌన్ చేసేందుకు నిర్ణయించారు. ఈ రెండురోజులు పాటు దస్తావేజులు రాయడం గాని, ఇసి, నకలు వంటి కార్యకలాపాలు నిర్వహించమని తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌రిజిస్ట్రార్ ఎం.తవిటయ్యకు అందజేస్తామని చెప్పారు.

### 'కంటి వెలుగు' వృద్ధులకు వరం

**పలాస :** రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు ప్రవేశపెట్టిన పథకం ద్వారా అవ్వ తాతలకు కంటి రోగులకు వరమని మాకన్నపల్లి సర్పంచ్ సైని దేసయ్య అన్నారు. మండలంలోని మాకన్నపల్లి గ్రామంలో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సర్పంచ్ సైని దేసయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడమే కాకుండా కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.. అనంతరం 25 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.. పది మంది కంటి రోగులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి కోరాడ ధనరాజు, కంటి వైద్య నిపుణులు రోణంకి వెంకటరమణ, సచివాలయం హెల్త్ సెక్రటరీ సిహెచ్ పార్వతి, ధనలక్ష్మి, ఆశ టి.జ్యోతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వైద్య పరీక్షలు

**జి.సిగడాం:** జి సిగడాం మండలంలో సంతవురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు టి.జయలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకి వైద్య పరీక్షలను మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకి రక్త పరీక్షలు, ఎత్తుకి తగ్గ బరువు ఉన్నారా ? లేదా అని పరీక్షించారు. పిల్లలు ఎక్కువగా జంక్ ఫుడ్ తినడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని ప్రధానోపాధ్యాయురాలు టి.జయలక్ష్మి అన్నారు. విద్యార్థులు ఎక్కువగా నీరు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్ఎల్‌హెచ్‌ఓ కె.సంతోషి, హెచ్‌ఎస్ పి.చంద్రశేఖర్, ఆశాలు ఈశ్వరమ్మ, విజయలక్ష్మి, పాఠశాల పిడి యుగంధర్, ఉపాధ్యాయులు కె.కష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రణాళికా లక్ష్యాలతో అభివృద్ధి సాధ్యం

**ఇచ్ఛాపురం :** ఇంటర్మీడియట్ దశ నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని కృషి చేస్తే అభివృద్ధి సాధ్యపడుతుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవ్య శ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, పట్టణ ఎస్.ఐ గోవిందరావు, ప్రభుత్వా. డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ నిత్యానంద పట్నాయిక్ ప్రసగించారు. నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించి మెరుగైన సమాజ నిర్మాణానికి కషి చేయలన్నారు. అనంతరం ఇటీవల కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన నవ్య శ్రీ మహంతిను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపక బందం పాల్గొన్నారు.

### పనిచేసే వారికే పట్టం కట్టాలి



సంకల్పయాత్ర నిర్వహిస్తున్న తేజేశ్వరరావు

**మెళియాపుట్టి:** పాతపట్నం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలని నియోజవర్గ నాయకులు, విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. మండలంలోని పట్టుపురం, జాడుపల్లి, పరశురాంపురం, చీపురుపల్లి, తూముకొండ, నందవ, కొత్తూరు, హీరాపురం, రాయికోలా, తదితర గ్రామాల్లో పాతపట్నం సమగ్రాభివృద్ధి సంకల్పయాత్ర పేరుతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలస, వారసత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు. ఎవరికీ ఇచ్చినా విషయ పరిజ్ఞానం తెలిసిన వారికి నియోజకవర్గంలో చోటు కల్పించాలన్నారు. స్వార్థ రాజకీయాల వల్ల రాష్ట్రంలో పాతపట్నం వెనుకబడిపోయిందన్నారు. వలస, వారసత్వ రాజకీయాలపై తెలియజేయడానికి ఈ సంకల్పయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, మాజీ సర్పంచ్ పడాల రాజారావు పాల్గొన్నారు.

### పుస్తకాల పంపిణీ

**టెక్కలి రూరల్ :** చైతన్య రథ సారథి, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి నందమూరి హరికష్ణ 5వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా టీమ్ తారక్ ట్రస్ట్ అధ్యక్షులు, టెక్కలి ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు దాలిశెట్టి భాస్కర్ ఆధ్వర్యంలో టెక్కలి గర్ల్స్ హైస్కూలులో 6వ తరగతి చదువుతున్న పిల్లలకు పుస్తకాలు, పెన్సిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్టీఆర్ అభిమానులు నర్సింహా, షణ్ముఖ, వెంకీ, ఢిల్లి, సుభాష్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### బలరాంరెడ్డి ఆకస్మిక మృతి

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం మండలంలో మందపల్లి గ్రామ పంచాయతీలో మూడుసార్లు సర్పంచిగా బాధ్యతలు చేపట్టిన బర్రి బలరాం రెడ్డి సోమవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడంతో పలువురు సంతాపం ప్రకటించారు. ఆయన మతి చెందడం వైఎస్ఆర్సీపీకి తీరని లోటని జిల్లా పరిషత్ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఎంపిపి బోర పుష్ప, పిఎసి ఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

### 50 మంది రక్తదానం

**రణస్థలం:** మండలంలోని కొండములగాం గ్రామంలో గ్రామ పెద్దలు యువత సహకారంతో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ ప్రతినిధి గొర్లె అప్పల నాయుడు, ఎంపిటిసి ప్రతినిధి రెడ్డి వాసుదేవరావు చేతుల మీదుగా ప్రారంభించారు. శిబిరాన్ని రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహన్ సందర్శించారు.

# 'ఎత్తిపోతల' వల్లే వంశధార నీటికి ఆటంకం

ప్రజాశక్తి – పలాస

టెక్కలి నియోజకవర్గంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఎత్తిపోతల పథకాలను ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఏర్పాటు చేయడం ద్వారా పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు వంశధార నీరు అందడం లేదని, ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసే సమయంలో అడ్డుకోకపోవడం వల్లే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అందుకు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష రైతులకు క్షమాపణ చెప్పాలని వంశధార ప్రాజెక్టు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయికృష్ణ డిమాండ్ చేశారు. కాశీబుగ్గ ప్రగతి భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో సుమారు ఆరు ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేయడం వల్ల అదనంగా సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరు మళ్ళిస్తుంటే దిగువ ప్రాంతాలకు వంశధార నుంచి నీరు ఎలా అందుతుందో చెప్పాలని గౌతు శిరీషను ప్రశ్నించారు. ఎత్తిపోతల పథకాలు అనధికారికంగా ఏర్పాటు చేయకూడదని అప్పటి వంశధార అధికారులు కలెక్టర్ దష్టికి తీసుకు వెళ్ళినా ఫలితం లేకపోయిందన్నారు. దిగువ ప్రాంతాలకు వంశధార నీరు అందుకోవడానికి ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసే సమయంలో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ మౌనం వహించడం ప్రధాన కారణమన్నారు. తప్పు మీరు చేసి మంత్రి సీదిరి అప్పలరాజు పై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ విప్ దుర్గాశంకర్ పండా, పలాస ఆసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవాని శంకర్, కౌన్సిలర్ సవర సోమేశ్వర రావు, మచ్చ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయికృష్ణ

# ఇక నగదురహిత లావాదేవీలు



సోంపేట : క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న ఎంపిపి దాసు

**లావేరు :** మండలంలోని అన్ని గ్రామ సచివాలయల్లోనూ నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇక నుంచి డిజిటల్ లావాదేవీలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలని మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ అన్నారు. మండల పరిసత్ కార్యాలయంలో నగదు రహిత లావాదేవీలు సంబంధించిన స్వేనర్లను కార్యదర్శులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ విధానాలపై సచివాలయల పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుప్పిలి సురేసుకుమార్, ఇఒపిఆర్‌డి వి.విశ్వేశ్వరరావు, లావేరు, మురపాక కార్యదర్శులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**సోంపేట :** పనుల చెల్లింపు అంశాల్లో డిజిటల్ లావాదేవీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డాక్టర్ దాసు కోరారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో నగదు రహిత లావాదేవీలకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా నీటి పన్ను, ఇంటి పనుల చెల్లింపులకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్లను ఇవ్వడం జరిగిందన్నారు. వీటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలి

ప్రజాశక్తి- పొందూరు

నిబంధనలకు ఉల్లంఘించి నాగావళి నదిలో సింగూరు వద్ద అక్రమంగా చేపడుతున్న ఇసుక తవ్వకాలను, ఇసుక మాఫియాను అరికట్టి, వారిపై చర్యలు తీసుకోవాలంటూ టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ కోరారు. ఈ మేరకు డిటి వెంకటేష్, ఎస్ఐ లక్ష్మణరావులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్రమ ఇసుక తవ్వకాలతో పర్యావరణ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని అన్నారు. తత్ఫలితంగా భూగర్భ జలాలు తగ్గిపోయి సాగు, తాగునీరుకు సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. 2021 మేలో వైసిపి ప్రభుత్వం ఇసుక తవ్వకాలను జెపి వెంచర్స్‌కు అప్పగించగా, దానికి సంబంధించి మే 2023తో అగ్రిమెంట్ ముగియడంతో పాటు జిఎస్‌టి నంబరు సస్పెండ్ అయిందని, కానీ, అదే కంపెనీ పేరుతో అదే జిఎస్‌టి నంబరుతో దొంగ బిల్లులు ఇచ్చి ఇసుక అక్రమాలకు ఎలా సాగుతున్నాయో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, నాయకులు సీపాన శ్రీరంగనాయకులు, బాడాన శేషగిరినాయుడు, బలగ శంకరభాస్కరరావు, లింగాల రాజయ్య, కాలెపు శ్రీను, పి.వాసు, అప్పలనాయుడు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

## ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఆ సంస్థ ట్రస్టీ అధినేత నారా భువనేశ్వరి పర్చువల్ ద్వారా మంగళవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు పాల్గొని మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో ఆక్సిజన్ అందించి ఎంతో మందికి ఆరోగ్య చికిత్సను మెరుగుపరచవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించినందుకు ట్రస్టుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ ట్రస్టు సభ్యులు, టెక్కలి నియోజకవర్గం మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు, బోయిన రమేష్, బోయన గోవిందరాజు, జీరు బీమారావు, హనుమంతు రామకృష్ణ, మెట్ట పురుషోత్తం, జీరు వెంకటరెడ్డి, మామిడి రాము, కోల లవకుమార్, కోల కామేశ్వరరావు పాల్గొన్నారు.

# వాలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి – జలుమూరు

మండలంలోని పాగోడు, పెద్ద దూగాం, లింగాలవలస, కరవంజ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న ఒక్కొక్క వాలంటీర్ పోస్టుకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో ఎల్వీ అప్పారావు తెలిపారు. వలంటీర్ పోస్టులకు ఆన్లైన్లో ఏడుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు ఆ ఏడుగురు హాజరైనట్లు చెప్పారు. ఈ ఇంటర్వ్యూల్లో ఎంపీడీవోతోపాటు తహసిల్దార్ బి సత్యం, ఈవోపీఆర్డి పి.ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో కార్యాలయ ఎఒఎ దామోదర్ రావు పాల్గొన్నారు.

**మెళియాపుట్టి :** మండలంలోని పలు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్ల భర్తీకి ఎంపిడిఒ పి.చంద్రకుమారి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏడు గ్రామ పంచాయతీ సచివాలయాలకు సంబంధించి ఎనిమిది పోస్టులు నోటిఫికేషన్ జారీ చేయగా, 16 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరైనట్టుగా తెలిపారు. మండలంలోని చాపర, కరజాడ, పడ్డ, పరశురాంపురం, పెద్దపద్మాపురం, ఎస్.కోలిగాం, రట్టిని గ్రామ సచివాలయాల నుంచి హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఒ తిరుపతి పట్నాయక్, ఎంఇఒ ఎస్.దేవేందరరావు పాల్గొన్నారు.

**జి సిగడాం**

జి సిగడాంలో 2, మర్రివలసలో 1, దేవరవలసలో 1 ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కే నిశ్చల ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేశారు. మండలంలో కొత్తగా నాలుగు పోస్టులకు 11 మంది అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఎనిమిది మంది విద్యార్థులు ఇంటర్వ్యూ కు హాజరైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈపిడిఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.